క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్‌ఎం

కోవెలకుంట్ల: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని జిల్లాస్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం అరుణకుమారి తెలిపారు. ఇటీవల కర్నూలులో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ 14 విభాగంలో రియా తబసుమ్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ మేరకు క్రీడాకారిణిని హెచ్‌ఎంతోపాటు పీఈటీ నాగమణి, కోచ్ సుధీర్, ఉపాధ్యాయులు అభినందించారు.

22 నుంచి దసరా ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబవుతున్న మారెమ్మ దేవాలయం

కోవెలకుంట్ల: పట్టణంలోని అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మ ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలు 11 రోజులపాటు కొనసాగుతాయన్నారు. మొదటి రోజు మారెమ్మ అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనం ఇవ్వనున్నారు. 23న గాయత్రీదేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయనిదేవి, 26న మహాలక్ష్మి, 27న లలితా త్రిపుర సుందరీదేవి, 28న మహాచండీదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబర్ 1వ తేదీ మహిషాసుర మర్ధినిదేవి, 2న రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు కనువిందు చేయనున్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

వీఆర్‌ఏల సంఘం నూతన కమిటీ



నూతన కార్యవర్గం

కోవెలకుంట్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో బుధవారం కోవెలకుంట్ల మండలం గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం మండల అధ్యక్షుడిగా శివరాముడు, ఉపాధ్యక్షుడిగా మధు, కార్యదర్శిగా మహబూబ్‌బాషా, కోశాధికారిగా రామ సుబ్బయ్య, సభ్యులుగా రమణ, నాయుడు, అంగడిబాషా, దేవ ఉసేనిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కోడూరు సత్యరాజు మాట్లాడుతూ.. డోన్ రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్హులైన వీఆర్‌ఏలను తహసీల్దార్ కార్యాలయాల అటెండర్లు, వాచ్‌మన్లుగా నియమించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

ప్రణాళికతో చదివితే విజయం సొంతం

సంజామల: విద్యార్థులు ప్రణాళికతో చదివితే విజయం సాధించవచ్చని సైకాలజిస్ట్ రామ సుబ్బయ్య అన్నారు. మండల పరిధిలోని ముక్కమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైకాలజిస్ట్ మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్‌లో ఎలాంటి కోర్సులు తీసుకుంటే మంచి అవకాశం ఉంటాయో తెలియజేశారు. ముఖ్యంగా ఏదైనా పరీక్షలు, కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు సన్నద్ధం అయ్యే ముందు మానసికంగా ధృడంగా ఉండాలని సూచించారు. వీటితో పాటు విద్యార్థులు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు వినతి

కోవెలకుంట్ల: త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నాయకులు చిన్న ఓబులేసు, శంకర్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

డోన్ టౌన్/బేతంచెర్ల: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినాన్ని డోన్, బేతంచెర్లలో బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆ పార్టీ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సందు వెంకటరమణ, బేతంచెర్లలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగమోహన్ ఆధ్వర్యంలో ఆలయాలను శుభ్రం చేశారు. డోన్ పాత బస్టాండ్‌లోని సమైక్యాంధ్ర కట్ట వద్ద మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్ కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేశారు. పార్టీ నాయకులు ఉషాలక్ష్మీ, బద్రీ సుధాకర్, సుబ్రమణ్యం, విజయభాస్కర్, రవిశంకర్ పాల్గొన్నారు.



పెద్దమ్మకొండ మార్గంలో అతి కష్టం మీద వెళ్తున్న వాహనాలు,



ఒంపులు తిరిగిన మలుపు

- ప్రమాదకరంగా ఉండడంతో ప్రతి రోజు సాహస ప్రయాణమే
- ఆందోళన చెందుతున్న వాహనదారులు

రక్షణ లేని మలుపులు

అవుకు(కొలిమిగుండ్ల): ఎత్తయిన కొండ.. ఆపై ఒంపులు తిరిగిన మలుపుల రోడ్డుతో ఆ గ్రామాల ప్రజలు ప్రతిరోజు సాహస ప్రయాణమే చేస్తున్నారు. అవుకు మండలంలోని కునుకుంట్ల కనుమ పొలిమేర పెద్దమ్మ కొండ మార్గంలోని మలుపులు ప్రమాదకరంగా మారాయి. కొండపైన కునుకుంట్ల, ఉప్పలపాడు, జూనుంతల, కొండమనాయినపల్లె, పిక్కిళ్లపల్లె తండా, మారేమడుగుల పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు వివిధ రకాల పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి రోజు ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. టెక్కే స్వామి దర్గాతో పాటు ఎర్రమల కొండల్లో ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీ కంబగిరిస్వామి ఆలయం ఉండడంతో మండల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వస్తుంటారు. ఎత్తు పల్లాలతో పాటు ప్రమాదకరమైన మలుపులు ఉన్న కారణంగా వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. ఏమాత్రం అదుపు తప్పినా వాహనాలు రిజర్వాయర్‌లో పడే ప్రమాదముంది. రెండు వాహనాలు ఎదురెదురుగా ప్రయాణించాలంటే అతి కష్టం మీద వెళ్లాల్సి ఉంటుంది. ఒకటి రెండు చోట్ల మాత్రమే రక్షణ గోడలు ఏర్పాటు చేసినా మిగిలిన చోట్ల ఏర్పాటు చేయలేదు. వాహనాలు మలుపుల వద్ద ఒక్క క్షణం అజాగ్రత్తగా వ్యవహరించినా తీవ్ర ప్రమాదం పొంచి ఉంది. వాహనదారులు పైభాగం నుంచి కిందకు వచ్చే సమయంలో భయంగా ప్రయాణిస్తుంటారు. రాత్రి వేళల్లో మరింత క్లిష్ట తరంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. రైతులు పండించిన పంటను వ్యాపారులు కొనుగోలు చేసి పెద్ద వాహనాల్లో తీసుకెళ్లాల్సిన సమయంలో పడరాని పాట్లు పడుతుంటారు. పెద్దమ్మ ఆలయం సమీపంలోని



మలుపులో లేని రక్షణ గోడ

మలుపు ఎక్కువగా ఉన్న కారణంగా వాహనాలు కట్ కాక అవస్థలు పడుతుంటారు. చాలా మంది వాహనదారులు కనుమ పెద్దమ్మ మీద భారం వేసి రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో పలు ప్రమాదాలు ఈ ప్రాంతంలో చోటు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని మలుపులను విస్తరించి రోడ్డును విశాలంగా చేసి రక్షణ ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అతివేగంతోనే ఎక్కువ ప్రమాదాలు

ప్యాపిలి: వాహనదారులు అతి వేగంతో వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఎస్‌ఐ మధుసూదన అన్నారు. స్థానిక కలచట్ల రోడ్డు వద్ద బుధవారం రాత్రి వాహన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. వాహనాలు నడిపే సమయంలో మొబైల్ మాట్లాడడం ప్రమాదకరం అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులు సక్రమంగా లేని పలు వాహనాలపై రూ. 3,070 జరిమానా విధించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కోవెలకుంట్ల: వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని కోవెలకుంట్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. పట్టణ శివారులోని కోవెలకుంట్ల- నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో కుందూనది వంతెన వద్ద బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. నంద్యాల, ఆళ్లగడ్డ, జమ్మలమడుగు, బనగానపల్లె, తాడిపత్రి, తదితర ప్రాంతాల వైపు వెళ్లే వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. ఆర్సీ, లైసెన్స్, హెల్మెట్, తదితర రికార్డులు లేని వాహనదారులకు జరిమానా విధించారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం

కోవెలకుంట్ల: ఎయిడ్‌వ్యాధిపై అవగాహన అవసరమని వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని వాసవీ బొమ్మిదాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన, టెస్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎయిడ్స్‌పై అవగాహన లేకపోవడం వల్లే వ్యాధిబారిన పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు దీనిపై ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని సూచించారు. రాష్ట్రంలో 3.24 లక్షల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులుండగా దేశంలో మన రాష్ట్రం రెండో స్థానంలో ఉందని తెలిపారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్‌క్లబ్ సమన్వయకర్త రామసుబ్బారెడ్డి, సీఈఆర్‌డీఎస్ ప్రాజెక్టు మేనేజర్ వర్ధనాచారి, అధ్యాపకులు భాస్కర్‌రెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణదాసు, రమణారెడ్డి, చైతన్య సొసైటీ సభ్యులు మేరీ, నరసింహ, సుమలత, అరుణ పాల్గొన్నారు.



ఎయిడ్స్ నియంత్రణ పోస్టర్లను విడుదల చేస్తున్న సభ్యులు

ఉపాధిహామీ లక్ష్యాలను పూర్తి చేయాల్సిందే

బనగానపల్లె: ఉపాధిహామీ పథకం లక్ష్యాలను పూర్తి చేయాలని ఎన్‌ఆర్‌జీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌ఆర్‌జీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉపాధి సిబ్బంది గ్రామాల్లోని ప్రతి ఇంటి వద్ద కంపోస్టు పిట్లు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఎఫ్‌ఏలు తమకు కేటాయించిన లేబర్ బడ్జెట్ టార్గెట్ పూర్తి చేయాలన్నారు.

నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కాటసాని

అవుకు(కొలిమిగుండ్ల): అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పాలెంనాగిరెడ్డి(73)బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి గ్రామానికి చేరుకుని నాగిరెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'చలో మెడికల్ కాలేజీ'ని విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల: మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన 'చలో మెడికల్ కాలేజీ'ని విజయవంతం చేయాలని ఆ పార్టీ యువజన, విద్యార్థి విభాగాల మండల అధ్యక్షులు సింగారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, గున్నాల శేష జశ్వంత్‌రెడ్డి అన్నారు. బుధవారం కోవెలకుంట్లలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఏర్పాటు చేసిన 10 కొత్త మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలని కుట్ర పన్నుతోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తీసుకురావాలని ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఏర్పాటు చేశారని తెలిపారు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేసి ప్రభుత్వ ఆస్తులను అమ్మకానికి పెట్టడం విచారకరమన్నారు. ఈ నెల 19వ తేదీ నంద్యాలలో నిర్వహించనున్న మెడికల్ కాలేజీని కాపాడుకుందాం కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గుద్దేటి సుధాకర్‌రెడ్డి, గోపిరెడ్డి నాగేశ్వరరెడ్డి, కిషోర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రియాజ్, దస్తగిరి, విశ్వం, సుభాస్, డీసీ ఉసేన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల అధ్యక్షులు

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి



గేదెకు టీకా వేస్తున్న ఏడీ కొండారెడ్డి

సంజామల: పాడి రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కొండారెడ్డి అన్నారు. బుధవారం సంజామలలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. పశువులకు టీకాలు వేయించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. పాల ఉత్పత్తి తగ్గుదల, దూడల్లో మరణాలను నివారించవచ్చని వివరించారు. నాలుగేళ్లు పైబడిన బర్రెలు, దూడలకు టీకాలు వేయవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 480 పశువులకు టీకాలు వేశామని వెల్లడించారు. అక్టోబర్ 15వ తేదీ వరకు టీకాల కార్యక్రమం జరుగుతుందని.. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు

డోన్: మహిళలు శారీరక, మానసిక ఆరోగ్యంతో ముందుకు సాగాలని కేంద్ర ప్రభుత్వం స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ పథకాన్ని అమలు చేస్తోందని డోన్ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, ఆర్‌ఎంఓ డాక్టర్ శిల్పా మాధవక్రిష్ణ తెలిపారు. గురువారం నుంచి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మహిళలు, కిశోర బాలికలకు రక్తపోటు, మధుమేహం, నోరు, గర్భాశయ, రొమ్ము క్యాన్సర్‌ల స్క్రీనింగ్‌తో పాటు క్షయవ్యాధి పరీక్షలు కూడా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మేరకు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ప్యాపిలి, బేతంచెర్ల, క్రిష్ణగిరి, వెల్దుర్తి, దేవనకొండ, పత్తికొండ, తుగ్గలి, మద్దికెర మండలాలకు చెందిన మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్. ఫీదాహుస్సేన్ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఇటీవల కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి పాల్గొని బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.లలిత తెలిపారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అతన్ని అభినందించారు.



బంగారు పతకం సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

రేపు డోన్‌కు ఆర్టీసీ ఎండీ రాక

డోన్ టౌన్: ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు ఈ నెల 19న డోన్ పర్యటనకు రానున్నారు. ఈ సందర్భంగా డిపో, బస్టాండ్, గ్యారేజ్‌లను రీజినల్ మేనేజర్ రజియా సుల్తానా, డిపో మేనేజర్ శశిభూషణ్‌లతో కలిసి బుధవారం పరిశీలించారు. సిబ్బంది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఎండీ పర్యటన విజయవంతం కావడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

ఊర్లకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలి

బేతంచెర్ల: మండలంలో వరుస దొంగతనాల దృష్ట్యా దసరా సెలవుల్లో ఊర్లకు వెళ్లేవారు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లేటప్పుడు విలువైన బంగారం, నగదు వంటి వస్తువులను ఇంట్లో ఉంచవద్దని, వీటిని బ్యాంక్ లాకర్లలో భద్రపరచాలని సూచించారు. ఇంటికి సెంటర్ లాక్ వేసి, బయట లైట్లు వేయాలన్నారు. తాళం బయటకు కనిపించకుండా కర్టన్స్ వేసుకోవాలని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇస్తే నైట్ గస్తీ నిర్వహిస్తామని చెప్పారు. ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి డీవీఆర్‌ను రహస్య ప్రదేశంలో ఉంచుకోవాలని సూచించారు. బస్సుల్లో ప్రయాణిస్తున్నప్పుడు సెల్‌ఫోన్, పర్సుపై పర్యవేక్షణ పెట్టుకోవాలని, బాహ్యంగా బంగారం లేదా విలువైన వస్తువులు ప్రదర్శించరాదని సూచించారు. ముఖ్యంగా బయటకు వెళ్లేటప్పుడు అందరికీ తెలిసేలా సోషల్ మీడియాలో ఫొటోలు పెట్టొద్దని పేర్కొన్నారు. అలా చేయడం వల్ల ఇంట్లో ఎవరూ లేరనే విషయం తెలుస్తుందన్నారు. ఎక్కడైనా అనుమానాస్పదంగా తిరిగే వారు కనిపిస్తే వివరాలు అడిగి, వారు స్పందించకపోతే తక్షణమే పోలీస్‌స్టేషన్ లేదా 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. చోరీల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వరరావు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

బేతంచెర్ల: పట్టణ పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ పిలుపునిచ్చారు. బుధవారం జ్ఞాన సరస్వతీ కళాశాల ఆధ్వర్యంలో స్వచ్ఛత హే సేవ కార్యక్రమం కింద ర్యాలీ నిర్వహించారు. అనంతరం బేతంచెర్ల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబ బలం





పలుకూరులో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ మధుమోనిక, సంజామల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

బనగానపల్లె రూరల్: మహిళల ఆరోగ్యమే కుటుంబ బలమని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ మధుమోనిక అన్నారు. బుధవారం మండలంలోని పలుకూరు పీహెచ్‌సీ ఆవరణలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియన్ కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 150 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు చాణక్యనాయక్, వెంకటేష్ ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

- **సంజామల:** వర్షకాలంలో బాలింతలు, గర్భిణులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలని సంజామల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు అన్నారు. కమలపురి గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో బాలింతలు, గర్భిణులు, మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని.. జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.
- **బేతంచెర్ల:** మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం శక్తిమంతంగా, ఆరోగ్యంగా విరాజిల్లుతుందని ఆర్‌ఎస్ రంగాపురం పీహెచ్‌సీ వైద్యుడు అబ్దుల్ అలీం అన్నారు. కార్యక్రమంలో భాగంగా వైద్యులు, సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

విశ్వకర్మ జయంతి వేడుకలు



కోవెలకుంట్ల: హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తాలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విరాట్ విశ్వకర్మ యజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణపతి, నవగ్రహ పూజలు, పంచబ్రహ్మల పూజ, గణపతి హోమం, విశ్వబ్రహ్మహోమం తదితర కార్యక్రమాలు జరిగాయి. పలు కాలనీలకు చెందిన విశ్వబ్రాహ్మణులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కుమార్ ఆచారి, రాజేశ్వరాచారి, మురళీమోహన్, ముత్తోజ్ హరికృష్ణమాచారి, దామోదరాచారి, శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.



బేతంచెర్ల: విశ్వకర్మ చిత్రపటం ఊరేగింపులో విశ్వబ్రాహ్మణులు

- **బేతంచెర్ల:** మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మ జయంతి వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని జీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో అర్చకులు యజ్ఞ మహోత్సవం నిర్వహించి, విశ్వకర్మ భగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టగా, దీనికి రూ.28 వేల విరాళం అందించిన దాత వెంకటేశ్వర్లును సత్కరించారు. సాయంత్రం వీరభద్రస్వామి వేషధారణ, నంది కోల సేవలతో గ్రామోత్సవం నిర్వహించారు.

కల్వర్టులకు మూతలు లేక ప్రమాదాలు

డోన్ టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళ్లే వంద అడుగుల రహదారి ప్రమాదకరంగా మారింది. కొత్తపేట జెడ్పీ హైస్కూల్, బీఎస్ఎన్‌ఎల్ కార్యాలయాలకు వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టులకు పైకప్పులు లేకపోవడంతో వాహనదారులు, పాదచారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిపై నిత్యం విద్యార్థులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా, కల్వర్టుల గుంతలు మూసివేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా మంగళవారం రాత్రి ఒక బొలెరో వాహనం టైరు గుంతలో ఇరుక్కుపోవడంతో డ్రైవర్ తీవ్ర ఇబ్బందులు పడ్డాడు. చివరికి జాకీల సహాయంతో వాహనాన్ని బయటకు తీశారు. నెలలు గడిచినా కల్వర్టులకు మూతలు ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.



గుంతలో ఇరుక్కుపోయిన వాహనం



కల్వర్టుపై ఉన్న గుంత

ప్రభుత్వ పాఠశాలకు బీరువా వితరణ



బీరువాను విరాళంగా అందజేస్తున్న సభ్యులు

డోన్: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయానికి రోటరీక్లబ్ సభ్యుడు మారెళ్ల రాజశేఖర్‌రెడ్డి రూ.15 వేలు విలువచేసే బీరువాను విరాళంగా అందజేశారు. బుధవారం ఎంఈఓ ప్రభాకర్‌ను కలిసి తాళాలు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు క్లబ్ తరఫున చేయూతనందిస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ సుజాత, క్లబ్ అధ్యక్షుడు జింకల క్రిష్ణ, కార్యదర్శి బలరాం, సభ్యులు జగన్‌మోహన్, లక్ష్మిరెడ్డి, సత్యసేనారెడ్డి, మల్లారెడ్డి, శంకర్ గౌడ్, దశరథ రామిరెడ్డి, గౌండ షా పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

డోన్ టౌన్: స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం డోన్ రైల్వేస్టేషన్ రోడ్డులోని ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యురాలు గ్రేస్ సెలిస్టియల్ తెలిపారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. మహిళ లు, కిశోరబాలికలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించి హోమియోపతి, యూనాని మందులను అందజేస్తామన్నారు.